

బోధన్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాజాగౌడ్, పక్కన అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంగాధర్



బోధన్ నుంచి ఎన్నికల సామగ్రితో పోలింగ్‌స్టేషన్లకు వెళ్తున్న సిబ్బంది



బోధన్ మండలం రాజీవ్‌నగర్ తండా పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ అధికారులు

# నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నియోజకవర్గంలో 246 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు
- మండలానికి ఒక మోడల్ పోలింగ్ స్టేషన్, దివ్యాంగుల కోసం మరో పోలింగ్ స్టేషన్

బోధన్, నవంబర్ 29: బోధన్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కోసం ఎన్నికల కమిషన్ బుధవారం సాయంత్రానికల్లా అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గంలో 246 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల కంటే అదనంగా ఏడు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేశారు. మొత్తం 246 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఎన్నికల సామగ్రి, సిబ్బంది తరలింపు, ఎన్నికల నిర్వహణకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ కేంద్రాన్ని (డీఆర్‌సీ) బోధన్ పట్టణంలోని విజయమేరీ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నుంచే ఈ డీఆర్‌సీ కేంద్రం నుంచి ఆయా పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంలు, వీవీ ప్యాట్లు తరలింపు ప్రారంభమైంది. పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో బుధవారం సాయంత్రానికల్లా సంబంధిత పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ ఆఫీసర్, ఇతర సిబ్బందిని నియమించారు. అదనంగా 50 మంది ప్రిసైడింగ్ అధికారులు, మరో 50 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను రిజర్వులో ఉంచారు. నియోజకవర్గంలో మొత్తం 24 రూట్లను ఏర్పాటుచేశారు. ఒక్కో రూట్‌కు ఒక సెక్టోరియల్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారు. పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తును ఏర్పాటుచేశారు.

**ఈవీఎంలను అందుకున్న ప్రిసైడింగ్ అధికారులు**

జిల్లా కేంద్రంలో భద్రపర్చిన ఈవీఎంలు బోధన్ డీఆర్‌సీ కేంద్రానికి రాగా, ఇక్కడ వాటిని ర్యాండమైజేషన్ (తారుమారు) చేసి పోలింగ్ స్టేషన్లకు కేటాయించారు. ఈవీఎంలకు చెందిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లను అందించారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో ఒక్కో ఈవీఎంను ఉంచుతారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే, అదనంగా కేటాయించిన ఈవీఎంలను ఉపయోగిస్తారు.



నీలాలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకురాలు

**2.20,068 లక్షల మందికి ఓటు హక్కు**

ఈనెల 11న ఎన్నికల కమిషన్ ప్రచురించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం బోధన్ నియోజకవర్గంలో మొత్తం 2,20,068 మందికి ఓటు హక్కు ఉంది. వీరిలో పురుషులు 1,05,573, మహిళలు 1,14,490 మంది ఉన్నారు. ఇతరులు ఐదుగురు ఉన్నారు. వీరంతా గురువారం తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

**దివ్యాంగుల కోసం వీల్ చైర్లు, ఇతర ఏర్పాట్లు**

దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈసారి ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ బాధ్యతను ఐసీడీఎస్ శాఖకు అప్పగించారు. నియోజకవర్గంలోని దివ్యాంగుల కోసం 141 లొకేషన్లలో 141వీల్ చైర్లు ఏర్పాటుచేశారు. పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసిన భవనాలకు మెట్లే కాకుండా ర్యాంప్‌లు ఉన్నట్లయితే, వీటిలో దివ్యాంగులను కూర్చోబెట్టి ఈవీఎం వద్దకు తీసుకెళ్తారు. దివ్యాంగులకు సహాయపడేందుకు ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వలంటీర్లను నియమించారు.

**పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన**

రెంజల్, నవంబర్ 29: మండలంలోని నీలా గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకురాలు తానియా సింగ్ బుధవారం తనిఖీ చేశారు. గురువారం నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఓటర్లకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆమె అన్నారు. ఆమె వెంట బీఎల్‌వో రాజ్యలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

**పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది**

బోధన్ రూరల్/ఎడపల్లి, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం పోలింగ్ విధుల్లో పాల్గొనే ఎన్నికల సిబ్బంది బుధవారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. బోధన్ నుంచి ఆయా అన్ని పోలింగ్ కేంద్రాలకు ప్రొసీడింగ్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ ఆఫీసర్‌తో పాటు పలువురు సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.



బోధన్ నుంచి బస్సులో పోలింగ్‌స్టేషన్లకు వెళ్తున్న సిబ్బంది



వివరాలను ఏసీపీ కిరణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకుంటున్న సీపీ కల్మేశ్వర్ సింగనేవార్

## 144 సెక్షన్ అమలు చేయాలి: సీపీ

శక్కర్‌నగర్, నవంబర్ 29: పోలింగ్ సందర్భంగా ఆయా కేంద్రాల సమీపంలో 144వ సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ సింగనేవార్ పోలీసు అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం పోలింగ్ నిర్వహించినున్న సందర్భంగా బోధన్ పట్టణంలోని పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. బోధన్ నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను ఏసీపీ కెఎం కిరణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు, పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు చేపట్టే ఏర్పాట్లపై ఆయన పలు చూచనలు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలని ఆయన పోలీసు అధికారులకు సూచించారు. ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఓటింగ్ జరిగేలా, సమయానుసారంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను పంపాలని, సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ కేంద్రాలకు అనుమతించవద్దని ఆయన సిబ్బందికి సూచించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ జయరాం, బోధన్ ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్, బోధన్ పట్టణ సీఐ బీడీ ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

# ఈదురుగాలులు..వడగండ్ల వాన

**కూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు**

రెంజల్, నవంబర్ 29: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వడగండ్ల వర్షం, ఈదురు గాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దండిగుట్ట ఫీడర్ పరిధిలోని దూపల్లి గ్రామ శివారులో వర్షంతోపాటు ఈదురు గాలులు వీయడంతో సుమారు 80-90 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో వ్యవసాయ, గృహావసరాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దూపల్లి గ్రామంలో సుమారు 22 గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ట్రాన్స్‌కో ఏఈ జి.రాజలింగం గురువారం తెలిపారు. సిబ్బందితో కలిసి తిరిగి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. రెంజల్-దూపల్లి బైపాస్ రోడ్డుపై చెట్టు విరిగి పడగా రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం కారణంగా పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తింది.

**బోధన్-నిజామాబాద్ రహదారిపై ..**

శక్కర్‌నగర్, నవంబర్ 29: భలమైన ఈదురు గాలులతోపాటు భారీ వర్షం కురిసింది. బోధన్-నిజామాబాద్ రహదారిపై పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిరోడ్డుపై పడిపోయాయి.

**నేలకూలిన చెట్లు**

ఎడపల్లి, నవంబర్ 29: మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన భారీ వడగండ్లతో వానకు చెట్లు రోడ్లపై కూలాయి. పలు గ్రామాల్లో వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఎడపల్లి మండలం జాన్కంపేట్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఆవరణలో మహావృక్షాలు నేలకూలినట్లు ఆలయ ఈవో వేణు తెలిపారు. ఆయా గ్రామాల్లో కూలిన చెట్ల కొమ్మలను గ్రామపంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు.

**బోధన్ మండలంలో..**

బోధన్ రూరల్, నవంబర్ 29: బోధన్ మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు చెట్లు విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.





సాటాపూర్ -పెగడపల్లి శివారులో నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్, రెంజల్ -దూపల్లి రోడ్డు మార్గంలో కూలిన చెట్టు



ఎడపల్లి మండలంలో గాలివానకు నేలకూలిన మహావృక్షం



బోధన్- నిజామాబాద్ రహదారిపై రోడ్డు పక్కన పడిన చెట్టు